# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 186
పేజీలు : 08 | వెల: రూ.5/-
మంగళవారం
ఏప్రిల్ 22, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




2లో..

## రూ.145 కోట్లతో మేడారంలో శాశ్వత పనులు

- భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



# గాడి తప్పుతున్న పాలన

వివరాలు2లో..

- కంచే చేను మేస్తే అన్నట్లుగా మారిన ఐఏఎస్, ఐపీఎస్‌ల పనితీరు
- లంచాల రొంపిలోకి లాగుతున్న మేయర్లు, ఎమ్మెల్యేలు
- రాజకీయ నేతలకు అంటకాగుతున్న అధికారులు
- అక్రమార్జనదారులపై కేంద్రం నిఘా
- సీన్‌లోకి కేంద్ర ఇంటెలిజెన్స్
- లోతుగా దర్యాప్తు చేస్తున్న నిఘా వర్గాలు



ప్రజలకు మెరుగైన పాలనను అందించడంలో ముఖ్య భూమిక పోషించాల్సిన సివిల్ సర్వెంట్లు గాడి తప్పుతున్నారు. నిబద్ధత, నిష్పక్షపాతం, నిజాయితీలకు నిలువుటద్దంగా నిలువాల్సిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల్లో కొందరు తమ పంథాను మార్చుకొని విధుల్లో చేరినప్పటినుంచే అక్రమార్జనను అలవాటుగా మార్చుకుంటున్నారు. కంచే చేను మేస్తే అన్నట్లుగా వారి వ్యవహార శైలి మారింది. ప్రజల అవసరాలను గుర్తించి పథకాలు రూపొందించడం..వాటిని అట్టడుగు వారికి అందేలా అమలు చేయడంలో కీలక భూమిక పోషించాల్సిన ఐఏఎస్, ఐపీఎస్ లు సంపాదనే లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు. కొంత మంది హైదరాబాద్ చుట్టుపక్కల పెద్ద ఎత్తున భూములు, ఫామ్‌హౌజ్‌లు కొనుగోలు చేశారంటూ కేంద్రానికి ఫిర్యాదులు అందడంతో ఇంటెలిజెన్స్ బృందాలను రంగంలోకి దింపినట్లు సమాచారం. వారు సర్వీసులోకి వచ్చిన కొత్తలో ఉన్న ఆస్తి ఎంత.. ఇప్పుడు ఎంత ఉన్నదనే వివరాలపై కేంద్ర నిఘా వర్గాలు ఆరా తీస్తున్నాయి. వీటితోపాటు బంధువుల పేర్ల మీద కూడబెట్టిన ఆస్తుల చిట్టాను సైతం సేకరిస్తున్నారు. ఇదిలా ఉండగా కొందరు మేయర్లు, ఎమ్మెల్యేలు వారి అక్రమాస్తులను పెంచుకునేందుకు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను లంచాల రొంపిలోకి లాగుతున్నట్లు సమాచారం. - వరంగల్ వాయిస్ ప్రతినిధి



8లో..

## యువకుడి కిడ్నాప్, హత్య

- కానిస్టేబుల్ తో సహ ఐదుగురి అరెస్ట్
- వివరాలు వెల్లడించిన సీపీ సన్‌ప్రీత్ సింగ్



8లో..

## కన్న కొడుకుని కడతేర్చిన తండ్రి

- రోకలి బండతో బాది హత్య
- రేగొండ మండలం రేపాకపల్లి గ్రామంలో దారుణం



8లో..

## ప్రసన్నాంజనేయ స్వామికి చందన సేవ

# గాడితప్పుతున్న పాలన



- కంచే చేను మేస్తే అన్నట్లుగా మారిన ఐఏఎస్, ఐపీఎస్ ల పనితీరు
- లంచాల రొంపిలోకి లాగుతున్న మేయర్లు, ఎమ్మెల్యేలు
- రాజకీయ నేతలకు అంటకాగుతున్న అధికారులు
- అక్రమార్జనదారులపై కేంద్రం నిఘా
- సీన్‌లోకి కేంద్ర ఇంటెలిజెన్స్
- లోతుగా దర్యాప్తు చేస్తున్న నిఘా వర్గాలు



**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** నిబద్ధత, నిష్పక్షపాతం, నిజాయితీలకు నిలువుటద్దంగా నిలువాల్సిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు అవినీతి మరకలు అంటుతున్నాయి. ఉన్నత చదువులు చదివి, ఉన్నతమైన ఉద్యోగంలో చేరి ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించాల్సిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులే అడ్డమైన గడ్డికి అలవాటు పడి వారి హోదాకు మచ్చ తెస్తున్నారు. తాను చేస్తున్న ఉద్యోగ ధర్మాన్ని ఏమాత్రం పట్టించుకోకుండా సంపాదనే లక్ష్యంగా అడుగులు వేస్తూ అక్రమాస్తులను కూడబెడుతున్నట్లు ఇంటెలిజెన్స్ వర్గాలు భావిస్తున్నాయి. కాదేదీ అక్రమార్జనకు అనర్హం అన్నట్లు సెటిల్ మెంట్లు, కబ్జాలు, మైనింగ్, గుట్కా, దో నంబర్ దందాలన్నింటిలోనూ కొందరు ఐఏఎస్, ఐపీఎస్ లు కీలకంగా వ్యవహరిస్తూ కోట్లకు పడగెత్తుతున్నట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. ఇందులో కొందరు మేయర్లు, ఎమ్మెల్యేలు వారికి సహాయ సహకారాలు అందిస్తూ లంచాల రొంపిలోకి లాగుతున్నట్లు సమారాచం. దీనిపై కేంద్ర ఇంటెలిజెన్స్ వర్గాలు లోతుగా దర్యాప్తు చేస్తున్నాయి. స్టేట్ కేడర్ లో పని చేస్తున్న ఇతర రాష్ట్రాలకు చెందిన వారి సొంత రాష్ట్రాల్లోనూ ఆస్తుల వివరాలపై నిఘా వర్గాలు ఆరా తీస్తున్నాయి.

## రంగంలోకి నిఘా వర్గాలు..!!

గత ప్రభుత్వ హయాంలో కీలకమైన శాఖల్లో పనిచేసిన పలువురు ఐఏఎస్, ఐపీఎస్‌లు పెద్ద ఎత్తున అక్రమ అస్తులు కూడబెట్టారంటూ కేంద్ర హోంశాఖకు ఫిర్యాదులందాయి. తమ ఫిర్యాదుతో పాటు ఆధారాలను సైతం అందజేసినట్లు తెలుస్తోంది. ఆ జాబితాలో విపక్షాలకు చెందిన కొందరు సీనియర్ నేతలు సైతం ఉన్నట్లు సమాచారం. ప్రధానంగా ఔటర్ చుట్టూరా ఎక్కువ మంది బ్యూరోక్రాట్స్‌లకు ఆస్తులు ఉన్నట్లు వీడియో, ఇమేజ్ డాక్యుమెంట్స్ నిఘా వర్గాల చేతికి అందాయి. వాటి ఆధారంగా ఏ ఆఫీసర్‌కు ఎక్కడెక్కడ ఎన్ని ఆస్తులు ఉన్నాయి..? ప్రస్తుత మార్కెట్ రేట్ ప్రకారం వాటి విలువ ఎంత..? వారి పేరుతోనే ఉన్నాయా..? లేక బంధువుల పేర్ల మీద ఉన్నాయా..? అనే కోణంలోనూ క్షేత్ర స్థాయిలో వివరాలు సేకరించినట్లు తెలిసింది.

## పలువురిపై ఫిర్యాదులు..

వరంగల్, కరీంనగర్ జిల్లాల్లో వివిధ హోదాల్లో పని చేసిన ఐపీఎస్ లు ఆయా నగరాల చూట్టూ ఉన్న భూములను పెద్ద మొత్తంలో కొనుగోలు చేసిన తీరుపై నాఘా వర్గాలు ఆరా తీస్తున్నాయి. గతంలో జిల్లా పోస్టింగుల్లో చక్రం తిప్పి ఇప్పుడు సిటీలో కీలకంగా పనిచేస్తున్న ఓ అధికారికి లెక్కకు మించి భూములు అన్నట్లు తెలుస్తోంది. గ్రేటర్ చుట్టూరా ఉన్న భూములతో పాటు వందల కోట్లకు పడగలెత్తిన రియల్ ఎస్టేట్ వెంచర్లలో ముగ్గురు ఐపీఎస్ లకు వాటాలున్నట్లు అనుమానిస్తున్నారు. గ్రేటర్ పరిధిలో కీలక పోస్టులో ఉన్న పోలీస్ అధికారి ఉమ్మడి నల్గొడ జిల్లా పరిధిలో మూడేళ్ల వ్యవధిలోనే నలభై ఎకరాల భూములను కొనుగోలు చేయడంపై నిఘా వర్గాలు ఆరా తీస్తున్నాయి.

హోం శాఖలో కాలకంగా వ్యవహరిస్తున్న ఒక అధికారి నగరం చుట్టూరా అయిదు చోట్ల భూములను కొనుగోలు చేసినట్లు సమాచారం. గత ఏడాది మియాపూర్ సమీపంలోని కోట్లాది రూపాయల భూముల కుంభకోణంలో సీఎంఓతోపాటు కీలక విభాగంలో పని చేసిన ఇద్దరు ఐఏఎస్ లకు ప్రమేయముందన్న ప్రచారం సాగింది.

## నిజాయితీ లోపిస్తోంది..

ఒకప్పుడు కొత్తగా సర్వీసులోకి వచ్చే ఐఏఎస్, ఐపీఎస్‌లు అక్రమాలకు దూరంగా ఉంటారనే ప్రచారం ఉండేది. కానీ, ఇప్పుడు అందుకు విరుద్ధంగా ఉందన్న విమర్శలున్నాయి. ట్రైనింగ్ పూర్తయి, ప్రొబేషనరీ టైమ్ నుంచే ఆస్తులు సంపాదించాలనే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు చర్చ జరుగుతోంది. క్యాలెండర్ ఇయర్ ప్రారంభంలోనే ఆల్ ఇండియా సర్వీసులోని ప్రతి అధికారీ తమ స్థిర ఆస్తుల వివరాలను హోంశాఖ పరిధిలోని డిపార్ట్ మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ (డీఓపీటీ)కు సమర్పించాల్సి ఉంటుంది. భూములు, ఇండ్లు, ఫ్లాట్స్, ఓపెన్ ప్లాట్స్ కొనుగోలు చేస్తే వాటి వివరాలను పేర్కొనాలి. తమ పేరు మీద కొనుగోలు చేసినా, ఫ్యామిలీ మెంబర్ల పేరు మీద కొనుగోలు చేసినా.. తప్పకుండా కేంద్రానికి తెలియజేయాలి. కానీ రాష్ట్రంలోని చాలా మంది ఐఏఎస్, ఐపీఎస్ లు తాము కొనుగోలు చేసిన అన్ని స్థిర ఆస్తుల వివరాలను డీవోపీటీకి చెప్పకుండా, ఒకటి అర చెప్పి చేతులు దులుపుకుంటున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ప్రిన్సిపల్ సెక్రెటరీ హోదాలో పనిచేస్తోన్న కొందరు ఐఏఎస్‌లు 20 ఏళ్ల కిందట తమ పేరు మీద ఉన్న ఆస్తుల వివరాలనే కేంద్రానికి పంపుతున్నారనే ప్రచారం జరుగుతోంది. గత ఏడాది 22 మంది, ఈ ఏడాది 18 మంది అధికారులు తమ ఆస్తుల వివరాలనే అందించలేదన్న ప్రచారం సాగుతోంది.



# నగరంలో.. టాస్క్‌ఫోర్స్ దాడులు

### పాడైపోయిన, నాణ్యత లేని అల్లం వెల్లుల్లి పేస్ట్ స్వాధీనం

### కాలం చెల్లిన ఐస్ క్రీం అమ్మిన వ్యక్తిపై కేసు

**వరంగల్ వాయిస్, క్రై :** పాడైపోయిన, నాణ్యత లేని అల్లం వెల్లుల్లిని ఉపయోగించి పేస్ట్ తయారు చేస్తున్న తయారీ కేంద్రంపై మంగళవారం టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించారు. మహా నగరంలోని కరీమాబాద్ ప్రాంతానికి చెందిన స్టార్ అల్లం, వెల్లుల్లి పేస్ట్ తయారీ కేంద్రంపై దాడులు నిర్వహించి ఎటువంటి ఆహార భద్రత నియమాలు పాటించకుండా కుళ్లిపోయిన పదార్ధాలతో పేస్ట్ తయారు చేస్తున్న ఆల్మిన్ అబ్బానీని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా రూ.1,24,500 విలువ కలిగిన అల్లం, వెల్లుల్లి పేస్ట్ ను స్వాధీనం చేసుకున్నారు.

## కాలం చెల్లిన ఐస్ క్రీమ్ లు..

కరీమాబాద్ లోని దయానంద్ ఐస్ క్రీమ్ డిస్ట్రిబ్యూటర్ లో ఫుడ్ సేఫ్టీ నియమాలు పాటించకుండా తయారీ, కాలం చెల్లిన తేదీలు ముద్రించకుండ, అమ్మకానికి సిద్ధంగా నిల్వచేసిన దాదాపు 9 రకాల కల్తీ ఐస్ క్రీమ్ ఉత్పత్తులను టాస్క్‌ఫోర్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.94,500 ఉంటుంది. ఈ సందర్భంగా దుకాణ యజమాని ఇరుకుల్ల సదానందంను అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఇన్స్పెక్టర్ జి.బాబులాల్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# రూ.145 కోట్లతో మేడారంలో శాశ్వత పనులు

- భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

**వరంగల్ వాయిస్, ములుగు :** వచ్చే సంవత్సరం ఫిబ్రవరి మాసంలో నిర్వహించనున్న మేడారం మహా జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్ధం చేపట్టే పనులు శ్వాస్వతంగా నిలిచేలా ఉండాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. మహా జాతర ఏర్పాట్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.145 కోట్లు కేటాయించనున్నదని ఆమె తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అధ్యక్షతన 2026 సంవత్సరంలో జరగనున్న మేడారం మహా జాతరను పురస్కరించుకొని అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు శాఖల అధికారులు చేపట్టనున్న పనులను మంత్రికి వివరించారు. అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ గతంలో లాగా జాతరకు రెండు నెలల ముందు పనులు ప్రారంభించి హడావుడిగా పనులు పూర్తి చేయకుండా కనీసం ఆరు నెలల సమయం తీసుకుని పూర్తి నాణ్యత పనులు ముగించాలని సూచించారు. వచ్చే సంవత్సరంలో మేడారం సమ్మక్క సారలమ్మ మహా జాతర తో పాటు గోదావరి పుష్కరాలు నిర్వహించడం జరుగుతుందని, రెండు పెద్ద పండుగలను పురస్కరించుకొని అన్ని శాఖల అధికారులు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. కుంభమేళ తరహాలో జరుగుతున్న శ్రీ మేడారం సమ్మక్క సారలమ్మ జాతరను విజయవంతం చేయడానికి కృషి చేయాలని, గత మహా జాతర సందర్భంగా మిగిలి ఉన్న రూ.50 కోట్లతో రానున్న మహా జాతరకు వినియోగిస్తామని తెలిపారు. గద్దెల పరిసర ప్రాంతాలను సుందరంగా తీర్చిదిద్దరమే కాకుండా జంపన్న వాగుపై ఐదు కోట్ల రూపాయలతో పెద్దలు పిల్లలు సేద తీర్చుకోవడానికి వీలుగా ఏర్పాట్లు చేయాలని, ప్రణాళిక బద్ధంగా శాశ్వత పనులు చెయ్యాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భక్తులకు అవసరము కానున్న పనులను ముందుగానే గుర్తించి సంబంధిత అధికారులు అంచనాలు తయారు చేయాలని, మహా జాతర సందర్భంగా రైతులకు అవగాహన నిర్వహించాలని అన్నారు. జాతర సందర్భంగా త్రాగునీటి సమస్య, మరుగుదొడ్ల సమస్య ఏర్పడకుండా చర్యలు తీసుకోవడంతో పాటు నిరంతరం పరిసరాలను పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. గత జాతరలో మేడారంలో జరిగిన ఇబ్బందులను సీసీ కెమెరాల పుటేజీల చూసి తద్వారా మేడారం లో ఏర్పాటు చేసి పనులను గుర్తించాలని, జాతర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా పోలీసు యంత్రంగం ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఐటీడీఏ పీవో చిత్ర మిశ్రా, అదనపు కలెక్టర్ రెవిన్యూ మహేందర్ జి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, ములుగు డీఎస్పీ రవీందర్, ఆర్డీఓ వెంకటేష్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, ఎఫ్ డీఓ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



## భూ భారతితో రైతుకు మేలు..

గత పాలకులు ధరణి పేరుతో రాష్ట్రంలోని రైతులందరినీ దగా చేశారని, అప్పటి అధికార పార్టీ నాయకులు లక్షలాది ఎకరాల భూమి పేరుతో కోట్లాది రూపాయలు దిగమింగారని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ఆరోపించారు. మంగళవారం మంగపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో అదనపు కలెక్టర్ రెవిన్యూ మహేందర్ జి జిల్లా గ్రంథాలయ చైర్మన్ బానోతు రవిచందర్ లతో కలసి భూ భారతి చట్టంపై రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం మంగపేట మండల పరిధి లోని 38 మంది కళ్యాణ లక్ష్మి, షాది ముభారాక్ లబ్ధిదారులకు చెక్కులను మంత్రి అందచేశారు.

# విద్యార్థులు ఇష్టపడి చదవాలి

■ పాఠశాల వార్షికోత్సవంలో ఎమ్మెల్యే జీఎస్సార్



**వరంగల్ వాయిస్, గణపురం :** మండలంలోని చెల్పూర్ గ్రామంలో ప్రాథమికొన్నత పాఠశాల, గణపురం మండలంకేంద్రంలోని మోడల్ స్కూల్ ప్రాథమికోన్నత పాఠశాలలో జరిగిన పాఠశాలల వార్షికోత్సవ వేడుకల్లో భూపాలపల్లి శాసన సభ్యుడు గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎమ్మెల్యేకి ఘన స్వాగతం పలికారు. విద్యార్థుల నృత్యాలు, కోలాటాలు చాలా ఆకర్షించాయి. ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతీ ఏడాది పాఠశాలల్లో నిర్వహించే వార్షికోత్సవాలు బడి పట్ల విద్యార్థుల్లో నమ్మకం, విశ్వాసాన్ని నింపుతాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ఉపాధ్యాయుల కృషి, తల్లిదండ్రుల తోడ్పాటు ఉంటే అద్భుతాలను సృష్టిస్తారన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు ప్రతీ రోజు కొంత సమయం కేటాయించి, వారితో విద్యాపరమైన సామాజిక అంశాలపై చర్చించడం ద్వారా వారిలో భయం పోతోందన్నారు. చదవుతో పాటు ఆటపాటలు కూడా చాలా అవసరం అన్నారు. నేటి బాలలే రేపటి పౌరులు అన్నారు. ప్రతి విద్యార్థి తమ లక్ష్యాలను ఎంచుకొని ఉన్నతమైన స్థానంలో ఉండాలని కోరారు. విద్యార్థుల కళా ప్రదర్శన అద్భుతంగా ఉందని అన్నారు. చెల్పూర్ పాఠశాలలో వాష్ రూమ్స్, పాఠశాల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తాను అన్నారు. పాఠశాల కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులకు టెంకాయ కొట్టి ఇట్టి నిర్మాణ పనులను ప్రారంభించాలని చెప్పారు. ఘనపూర్ మండలం మోడల్ పాఠశాలలో డైనింగ్ హాల్, సైన్స్ ల్యాబ్ ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం పోటీ పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉపాధ్యాయులను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి, జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్, మండల ఎంపీడీఓ భాస్కర్, తాసిల్దార్ సత్యనారాయణ స్వామి, కాంగ్రెస్ నాయకులు రేపాక రాజేందర్, దుర్గయ్య, ఎం.శివ శంకర్ గౌడ్, కె.శ్రీనివాస్, ఓ.కృష్ణ, వి.నారాయణ, డి.శంకరయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లొద్దు

### ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు




**వరంగల్ వాయిస్, పరకాల :** మండలంలో గత రెండు మూడు రోజులుగా ఎండ తీవ్రంగా ఉంటున్నందున, ప్రజలు అత్యవసరమైన పరిస్థితుల్లో మాత్రమే బయటకు వెళ్లాలని పరకాల ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు సూచించారు. బయటకు వెళ్లాల్సి వచ్చిన పరిస్థితుల్లో గొడుగు, మంచినీళ్లు తప్పనిసరిగా తీసుకెళ్లాలని అన్నారు. ఎండ ప్రభావంతో గ్రామాల్లో తాగునీటి కొరత తలెత్తకుండా ఉండేందుకు పంచాయతీ కార్యదర్శులు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఎలాంటి ఇబ్బందులు ఎదురైతే మంపా (మండల పంచాయతీ అధికారి) లేదా ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ (గ్రామీణ నీటి సరఫరా విభాగం అసిస్టెంట్ ఇంజనీర్) తో సంప్రదించి తక్షణమే పరిష్కార చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుద్ధ్య విషయంలో కూడా జాగ్రత్తలు తీసుకోవాలని, దోమల సమస్య నివారణకు రెగ్యులర్‌గా ఫాగింగ్ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో ప్రజలకు మొదటి సహాయం అందించేలా, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్ల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని మండల వైద్యాధికారిని కోరారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను తక్షణమే తన దృష్టికి తీసుకువచ్చితే, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితంగా పరిష్కరించే చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ తెలిపారు.

## లెనిన్ పోరాట స్ఫూర్తితో ముందుకు సాగుదాం



**వరంగల్ వాయిస్, ఖిల్లా వరంగల్:** దేశంలో పెరుగుతున్న పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద దోపిడికి వ్యతిరేకంగా అణగారిన, శ్రమజీవి వర్గాలు ఐక్యంగా పోరాడి కార్మిక వర్గ ఆధిపత్య రాజ్యాన్ని నెలకొల్పాలని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ వరంగల్ జిల్లా నాయకులు మైదం పాణి పిలుపునిచ్చారు. మంగళవారం ఖిల్లా వరంగల్‌లోని పెట్రోలు పంప్ సెంటరులో, సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ ఆధ్వర్యంలో మార్క్సిజం మేధావి, రష్యన్ విప్లవ నేత కామ్రేడ్ లెనిన్ జయంతి, అలాగే పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో లెనిన్ చిత్రపటానికి పుష్పాంజలి అర్పిస్తూ, అతని విప్లవాత్మక భావజాలాన్ని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా మైదం పాణి మాట్లాడుతూ కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడిదారులకు అనుకూలంగా వ్యవహరిస్తూ, సామాన్య ప్రజల సంక్షేమాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నాయని తీవ్రంగా విమర్శించారు. మోడీ ప్రభుత్వం పెద్ద పెద్ద సంస్థలకు రుణాలు, ఆర్థిక రాయితీలు ఇస్తూనే, నిత్యావసర ధరలు పెంచి, పేద ప్రజలపై భారీ ఆర్థిక భారాన్ని మోపుతోందని పేర్కొన్నారు. ప్రజలు లెనిన్ పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని, కుల, మత, ఆర్థిక అసమానతలతో పోరాడి సమానత్వం ఉన్న సమాజ నిర్మాణం కోసం ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.నరసింహారావు, సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ డివిజన్ నాయకులు అంకూష్, కట్కూరి చిన్నస్వామి, రమేష్, మియాపురం రమేష్ పాల్గొన్నారు.

# ఇంటర్ ఫలితాల్లో వైబ్రంట్ అకాడమీ ప్రభంజనం




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఇంటర్మీయట్ ఫలితాల్లో వైబ్రంట్ అకాడమీ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని వైబ్రంట్ అకాడమీ చైర్మన్ సిరంగి శ్రీనివాస్, డైరెక్టర్ సిహెచ్ రాజేందర్రెడ్డి సంయుక్తంగా తెలియజేశారు. ఈ సందర్భంగా అకాడమిక్ డైరెక్టర్ సీహెచ్ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ పేద విద్యార్థుల కోసం కోటా రాజస్థాన్ వారి వైబ్రంట్ అకాడమీ వరంగల్ లో స్థాపించడం జరిగిందన్నారు. మంగళవారం తెలంగాణ రాష్ట్రం విడుదల చేసిన ఇంటర్మిడియట్ ఫలితాలలో వైబ్రంట్ అకాడమీ విద్యార్థులు అత్యధికంగా ప్రథమ ఫలితాలు సాధించారని, ఇలాంటి ఫలితాలు అకాడమీ స్థాపించిన మొదటి సంవత్సరంలోనే సాధించడం చాలా సంతోషంగా ఉందని వారు పేర్కొన్నారు. వైబ్రంట్ అకాడమి మొదటి నుంచి జేఈఈ మేయిన్స్, అడ్వాన్స్, నీట్, ఇంటర్మిడియట్ లలో అత్యుత్తమమైన శిక్షణను వరంగల్ లో అందించడం జరుగుతుందని వారు తెలియజేశారు. గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చిన విద్యార్థులను సైతం చక్కటి అకాడమిక్ ప్రోగ్రామింగ్, ప్రణాళికల ద్వారా అద్భుతమైన అణిముత్యాలుగా తయారుచేసి రాష్ట్ర స్థాయిలోనే అత్యధికమైన ప్రథమ ఫలితాలు ఇంటర్మిడియట్ లో సాధించడం జరిగిందని తెలిపారు. తదనంతరం ఎంపీసీలో వి.సాయిచంద్ర (467 మార్కులు), ఎన్. నిహాల్ (467 మార్కులు), పి.శ్రీ మహర్ష (467 మార్కులు), జి.జాహ్నవి (466 మార్కులు), ఎం.రాంచరణ్ (466 మార్కులు), ఎం. కార్తీకెడ్డి (466 మార్కులు), బైపీసీలో బి.వినాయక్ (435 మార్కులు), ఎ.హర్షిత (431 మార్కులు), కె.సాయి (431 మార్కులు) సాధించిన విద్యార్థులను అభినందించారు. అలాగే వీరితో పాటుగా 85 మంది విద్యార్థులు ఎంపీసీలో 400 మార్కులకు పైగా, బైపీసీలో 15 మంది విద్యార్థులు 350 మార్కులకు పైగా సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైబ్రంట్ అకాడమీ ప్రిన్సిపాల్ టి.శేషుకుమార్, అడ్మినిస్ట్రేషన్ హెడ్ జి.రఘుపతి, కోఆర్డినేటర్ రామ్ గుమ్మడి, అధ్యాపక బృందం, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ సమతుల్యత పాటించాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఈ భూమి మీద నివసించే ప్రతి ఒక్కరిపై పర్యావరణాన్ని కాపాడే బాధ్యత ఉందని ప్రముఖ సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం "ధరిత్రి దినోత్సవం" సందర్భంగా మాట్లాడిన ఆయన, ఈ విశ్వంలో మూడు వంతులు నీరు కాగా, ఒక వంతు మాత్రమే భూమి ఉన్నదని, అందుకే భూమిపై జీవించే ప్రతి జీవిని కాపాడుకుంటూ పర్యావరణ సమతుల్యతను పాటించడం అత్యవసరమన్నారు. వన్యభూములను సంరక్షించడం, సేంద్రియ ఎరువుల వాడకాన్ని ప్రోత్సహించడం ద్వారా భూసాంద్రతను పెంపొందించుకోవాలని, పట్టణాల్లో పచ్చదనం కోసం తగినంత స్థలాన్ని కేటాయించాలని సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడంతో పాటు, కార్బన్ ఉద్గారాలు విడుదల చేసే వాహనాల వినియోగాన్ని తగ్గించి, చిన్నచిన్న దూరాలకు సైకిల్‌ను వినియోగించాలన్నారు. నీటిని పొదుపుగా వాడుతూ, మొక్కల పెంపకాన్ని ప్రోత్సహించడం ద్వారా భూమిని కాపాడుకోవచ్చని నిమ్మల శ్రీనివాస్ తెలిపారు.

## నిరసన ర్యాలీ విజయవంతం



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ప్రభుత్వం తీసుకవచ్చిన వక్ఫ్ బిల్లు సవరణ చట్టాన్ని రద్దు చేయాలంటూ మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ముస్లిం ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన ర్యాలీని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి హృదయపూర్వక ధన్యవాదాలు... మీ ఆదరణ అభిమానానికి సదా కృతజ్ఞతలను ముస్లింల ఐక్య వేదిక జిల్లా కార్యదర్శి ఎగ్బాల్ తెలిపారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రం లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ర్యాలీ స్ఫూర్తి తో వక్ఫ్ సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం ఉప సంహరించుకునే వరకు పోరాటాలను ఉదృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.ఈ సమావేశంలో ముస్లింల ఐక్య వేదిక ప్రతినిధులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** మండలంలోని పాత ముద్దుపురం గ్రామంలో ఇటీవల మరణించిన కళ్లెపు యాకయ్య కుటుంబానికి జై గణేష్ మహిళా పొదుపు సంఘం ఆధ్వర్యం 50కేజీల బియ్యం, రూ.1500 నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో పొదుపు సంఘం సభ్యులు ముత్యాల రమాదేవి, కట్టూరి మంజుల, మంచిక పద్మ, సుంకరి రమాదేవి, ననుమాస కవిత, పోలేపల్లి పద్మ, విజయ, కొండపర్తి శ్వేత, ననుమాస శారద, చిర్ర సారమ్మ, కలవచర్ల సుభద్ర, కొండపర్తి భారతమ్మ ననుమాస సూరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## హనుమాన్ స్వాముల ప్రత్యేక పూజలు



**వరంగల్ వాయిస్, గణపురం :** మండల కేంద్రంలోని ప్రసిద్ధిగాంచిన శ్రీ పట్టాభి సీతారామచంద్ర స్వామి దేవాలయంలో మంగళవారం ఆలయ అర్చకులు ముసునూరి నరేష్ మండల కేంద్రానికి చెందిన హనుమాన్ మాల స్వాములు ఆలయంలో హనుమంతుడి విగ్రహానికి ప్రత్యేకంగా పంచామృత అభిషేకం, చందనం, రకరకాల పూలు పండ్లతో స్వామివారికి పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాల ధారణ స్వాములు కోయిల, కార్తీక్, జాటోత్ మహేష్, చెలమల్ల ప్రవీణ్ కుమార్, బూర తిరుపతి, సిరంగి వెంకటేష్, వడ్ల శివ, వడ్ల శ్రీకాంత్, మద్దెల అజిత్, డ్యాగల వెంకటేష్, ఆలయ అధ్యక్షులు తాళ్లపల్లి గోవర్ధన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# రజతోత్సవ సభకు ప్రచార అనుమతులివ్వండి

## మున్సిపల్ కమిషనర్‌కు కార్పొరేటర్ల విజ్ఞప్తి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న జరగనున్న భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) రజతోత్సవ సభ సందర్భంగా వరంగల్ నగరంలో ఏర్పాటు చేయనున్న ప్రచార ఫ్లెక్సీలు, పార్టీ జెండాలు, హోర్డింగులు, బంటింగ్స్, స్టిక్కర్లు, వాల్ రైటింగ్స్‌కు అనుమతి కోరుతూ మంగళవారం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడేను పార్టీకి చెందిన కార్పొరేటర్లు కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రచార సామగ్రిని సభ పూర్తయ్యే వరకు తొలగించకుండా మున్సిపల్ సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్పొరేటర్ల అభ్యర్థనపై కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. ఈ సమావేశంలో పలువురు బీఆర్ఎస్ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని నర్సక్కపల్లి గ్రామానికి చెందిన బాణాల స్వరూప అనారోగ్యంతో కన్నుమూశారు. ఈ సందర్భంగా వారి భౌతిక దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ కాళి ప్రసాదరావు, వరికోల్ గ్రామానికి చెందిన పింగిలి వీరన్న అనారోగ్యంతో మరణించడంతో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు ఎరుకల దివాకర్, మాజీ మండల అధ్యక్షులు గోగుల రాజిరెడ్డి, మూల తిరుపతిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి దండు సురేష్, కంటాత్మకూర్ మాజీ సర్పంచ్ శివకుమార్, అలాగే కుమారస్వామి, రాజయ్య, ఆకునూరి రమేష్, ముస్కె రాజు, తవిటి రాజ్ కుమార్, జవ్వాజి శ్రీకాంత్, రమేష్, బొల్ల కుమార్, రాజు, పింగళి రామకృష్ణ సహా పలువురు బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంగన్వాడీ సేవలను సద్వినియోగించుకోవాలి



**వరంగల్ వాయిస్, రేగొండ :** గోరికొత్తపల్లి మండలంలోని కొత్తపల్లి గ్రామ అంగన్వాడీ కేంద్రంలో "పోషణ పక్షం" కార్యక్రమం సందర్భంగా అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్ ఆర్. ప్రియాంక మాట్లాడుతూ, అంగన్వాడీ కేంద్రాల ద్వారా లభించే సేవలను లబ్ధిదారులు పూర్తిగా వినియోగించుకోవాలని సూచించారు. ఆమె మాట్లాడుతూ, గర్భధారణ ప్రారంభమైన దశ నుంచి బిడ్డ రెండేళ్లు పూర్తయ్యే వరకూ మొత్తం వెయ్యి రోజుల కాలం అత్యంత కీలకమైందని వివరించారు. ఈ సమయంలో తల్లులు తీసుకునే జాగ్రత్తలే బిడ్డ ఆరోగ్యం, భవిష్యత్తుపై ప్రభావం చూపుతాయని తెలిపారు. ఇంతేకాక, అంగన్వాడీ కేంద్రాల్లో 6 నెలల నుంచి 3 సంవత్సరాల వయస్సు ఉన్న పిల్లలకు పౌష్టికాహారం, 3 నుంచి 6 సంవత్సరాల వయస్సు పిల్లలకు పౌష్టికాహారంతో పాటు ఆటపాటల ద్వారా పూర్వ ప్రాథమిక విద్యను అందిస్తున్నట్టు పేర్కొన్నారు. అలాగే, ఇంట్లోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ, ఎస్ఎస్ఎఫ్ పీ లోప పోషణ నివారణ, ఉబకాయం తగ్గింపు వంటి అంశాలపై కూడా గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ప్రమీల, భూదేవి, బేబీ, నర్మద, అనిత, రజిత, సుగుణమ్మ, శాంతమ్మ, అలాగే కిశోర బాలికలు మేఘన, అక్షర, సాయి ప్రకృతి, జోత్స్న తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి

## ● సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకా రెడ్డి




**వరంగల్ వాయిస్, జనగామ:** మే 1న ప్రపంచ కార్మిక దినోత్సవం (మేడే) సందర్భంగా జనగామ పట్టణంలోని అన్ని వార్డుల్లో సీపీఎం, సీఐటీయూ జెండాలను ఆవిష్కరించాలని, ఈ కార్యక్రమాల్లో కార్మికులు, రైతులు, కూలీలు, ప్రజలందరూ చురుకుగా పాల్గొని మేడేను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకా రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం సీపీఎం జనగామ పట్టణ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సమావేశానికి జనగామ పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన కనకా రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి కేంద్ర బిందువుగా ఉన్న జనగామలో ప్రజా ఉద్యమాలపై ప్రత్యేక చైతన్యం ఉండాలని, మేడే స్ఫూర్తితో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలను నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఈ ప్రాంత ప్రజలు ఎర్రజెండాలు పట్టుకుని నైజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రస్తుతం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక హక్కులను పక్కన పెట్టి, ఎనిమిది గంటల పని దినానికి తూట్లు పెట్టేలా నాలుగు లేబర్ కోడ్లను తీసుకువచ్చి కార్మికులను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే విధంగా విధానాలు తీసుకువస్తోందని విమర్శించారు. ఇక ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తూ, ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడంలో విఫలమై, పేద ప్రజలపై భారాలు మోస్తోందని, రైతులకు గిట్టుబాటు ధర లేదని, దళితులు, గిరిజనులకు రక్షణ లేకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు.ఈ పరిస్థితుల్లో మేడేను జయప్రదం చేయడం ద్వారా కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా ప్రజా ఉద్యమాలను ముమ్మరం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బూడిది గోపి, ఎండి అజారుద్దీన్, పట్టణ కమిటీ సభ్యులు బాల్న వెంకట మల్లయ్య, బొట్ల శ్రావణ్, రామకృష్ణమూర్తి, ధరావత్ మహేందర్, భూనాద్రి వెంకటేష్, గంగరబోయిన మల్లేష్, రాజ్ మేడ ఆనందం, మాదాసు సుధాకర్, బాలస్వామి, కర్ణాకర్, బూడిద అంజమ్మ, పద్మ, మమత, వరలక్ష్మి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ ఫలితాల్లో ఏకశిలా విజయ విహారం




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నేడు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఇంటర్ ఫలితాలలో ఏకశిలా జూనియర్ కళాశాల విద్యార్థులు స్టేట్ ర్యాంక్ ఫలితాలలో విజయం సాధించారు. ఈ సందర్భంగా స్టేట్ ర్యాంక్ సాధించిన విద్యార్థులను ఏకశిలా విద్యాసంస్థల చైర్మన్ డా.గౌరు తిరుపతిరెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఏకశిలా విద్యాసంస్థల చైర్మన్ డా.గౌరు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ నిరంతర యాజమాన్య పర్యవేక్షణతో, పటిష్టమైన ప్రణాళిక, సమిష్టి కృషి, సహజ నైపుణ్యాన్నీ వెలికితీసే ప్రేరణ తరగతులు, ఒత్తిడి లేని విద్య కోసం ప్రముఖ వ్యక్తులతో అవగాహనా సదస్సులతో పాటు, అత్యుత్తమమైన బోధనతో, క్రమశిక్షణతో కూడిన విద్యావిధానంతో ఇంటర్ ఫలితాలలో అన్ని విభాగాలలో రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానం సాధిస్తూ, ఓరుగల్లులో తిరుగులేని విద్యాసంస్థలుగా మా ఏకశిలా విద్యాసంస్థలు నిలుస్తున్నాయని తెలిపారు. ఈ సమావేశంలో ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాలలో రాష్ట్ర స్థాయి మార్కులు సాధించిన విద్యార్థిని విద్యార్థులను, తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను అభినందించారు. ఇంటర్ ఫలితాలతో పాటు, కాంపిటీటివ్ పరీక్షలైన జేఈఈ మెయిన్స్ 2025లో అత్యుత్తమ ఫలితాలను సాధించామని, నీట్, ఈఏప్ సెట్ లలో కూడా మంచి ర్యాంకులను సాధిస్తామని ధీమా వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ తిరుపతి రెడ్డితో పాటు డైరెక్టర్ యం.జితేందర్ రెడ్డి, ప్రిన్సిపాల్స్ సుధాకర్ రెడ్డి, తిరుపతిరెడ్డి, రాజిరెడ్డితో పాటు బోధనా సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# మోడీ ప్రజావ్యతిరేక విధానాలపై నిరసన




**వరంగల్ వాయిస్, వరంగల్ :** భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రజల ప్రయోజనాలను పక్కనబెట్టి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అధికారం కోసం చేపట్టిన సామ్రాజ్యవాద విధానాలకు మద్దతు ఇస్తూ దేశాన్ని విదేశీ అధికారాల చేతిలో తాకట్టు పెడుతున్నారని సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ గ్రేటర్ వరంగల్ కమిటీ కార్యదర్శి రాచర్ల బాలరాజు తీవ్రంగా విమర్శించారు. మంగళవారం రష్యా సోషలిస్టు విప్లవ నాయకుడు కామ్రేడ్ లెనిన్ 145వ జయంతి సందర్భంగా, సీపీఐ ఎంఎల్ పార్టీ 56వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఖిలా వరంగల్ పడమర కోటలో న్యూ డెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో ఒక సమావేశం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి కామ్రేడ్ బండి కోటేశ్వరరావు అధ్యక్షత వహించగా, ప్రారంభంలో రాచర్ల బాలరాజు జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి వ్యాన్స్ తో మోడీ ప్రభుత్వం భారత్‌కు నష్టకరమైన రక్షణ, ఇంధన, వాణిజ్య ఒప్పందాలు చేసుకునే ప్రమాదం ఉందని అన్నారు. దేశ రైతుల మీద ప్రభావం చూపే విధంగా వ్యవసాయ రంగంలో, పరిశ్రమల రంగాల్లో అవమానకరమైన ఒప్పందాలు జరుగుతున్నాయని విమర్శించారు. ఈ సమావేశంలో పాల్గొన్న పీడీఎస్‌యూ రాష్ట్ర పూర్వ ఉపాధ్యక్షులు తీగల జీవన్ మాట్లాడుతూ, దేశ వ్యాప్తంగా దళిత, ఆదివాసీ, బహుజనులపై హిందూత్వ దాడులు పెరుగుతున్నాయని, రాజ్యాంగ హక్కులను కేంద్రం హరించేస్తోందని చెప్పారు. పీడీఎస్ యూ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి మహేష్ మాట్లాడుతూ కామ్రేడ్ లెనిన్ పోరాటాల నుంచి నేర్చుకోవాలని, దేశంలో ప్రజాస్వామ్య సాధన కోసం యువత, విద్యార్థులు పోరాటాల్లో చురుకుగా పాల్గొనాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు భైరబోయిన ఐలయ్య, పీవైఎల్ జిల్లా నాయకుడు గంధ్రతి హరిబాబు, పీడీఎస్ యూ నాయకుడు రాజేష్, ఐఎఫ్‌టీయూ నాయకులు గద్దల ప్రభాకర్, ఎండీ ఖాన్, పాలకుర్తి సత్యనారాయణ, ఇనుముల కృష్ణ, సుద్దాల వీరన్న, బండి రవి, మన్నే కరుణాకర్, యాకయ్య, రాతిపెల్లి కృష్ణ, ఎండీ అక్బర్, పుప్పాల రవి, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ ఫలితాల్లో మోషన్ కాలేజీ విద్యార్థుల విజయకేతనం




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నేడు ప్రకటించిన ఇంటర్ మొదటి, రెండవ సంవత్సరం ఫలితాలలో హనుమకొండ నయీంనగర్ లోని రాజస్థాన్ కోటా బ్రాంచ్ అయిన మోషన్ జూనియర్ కాలేజీ విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించి విజయకేతనం ఎగురవేశారని మోషన్ కాలేజీ చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ తెలిపారు.

బైపీసీ రెండవ సంవత్సరంలో గంధ్ర షణ్ముఖశ్రీ 993, (2538219964) షగుప్త 992 (2538319813), బండి రేణుక 991(2538219119) మార్కులు, ఎంపీసీ విభాగంలో గుండవేని అశ్విత 992 (2538219190) మార్కులు సాధించారు. ఎంపీసీ మొదటి సంవత్సర విభాగంలో చింతాకుల శ్రీతేజ (2538118578), పల్లిక శ్రీవర్ధిత 467 (2538119364), దేవాన్ష్ చౌహాన్ 467 (2538119391), తీర్థాల అశ్విత 466 (2538118493), బిట్ల హాసిని 466 (2538120517), మర్రి శ్రీష్మ 465 (2538118536,) అక్కనపల్లి నిహారిక 465 (2538119265), ఇమ్మిడి శరణ్య 465 (2538121123) మార్కులు, బైపిసి విభాగంలో వోల్లోజి హరి హరణి 430 (2538118220), దుంపటి శ్రీనిత 430 (2538119446) వీరితో పాటు చాలా మంది విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించడం జరిగిందని వేణుగోపాల్ గౌడ్ తెలిపారు. ఇంతటి ఘన విజయం సాధించిన విద్యార్థులకు, వారికి తోడ్పడిన అధ్యాపక బృందానికి, తల్లిదండ్రులకు, శ్రేయోభిలాషులకు మోషన్ కాలేజీ యాజమాన్యం తరపున ప్రత్యేక అభినందన తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ పెరుమాండ్ల అనిల్ గౌడ్, బ్రాంచ్ హెడ్ ముత్యాల సురేష్, కోటా అధ్యాపకులు అనూప్ కపూర్, రామన్ పండా, ప్రదీప్ పాఠక్, సురేందర్ కుమార్ సాహు, శ్రీనివాస్ రెడ్డి, సరోత్తం రెడ్డి, తాళ్లపెల్లి రమేష్ గౌడ్, మండల రాజు, లక్ష్మణ్, మౌనిక, నాగరాణి, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా ప్రారంభం



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణ కేంద్రంలోని చింతల్ గ్రౌండ్ ఆవరణలో మంగళవారం క్రికెట్ టోర్నమెంట్ ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మాజీ ఎమ్మెల్యే ములుగూరి భిక్షపతి, పరకాల సీఐ క్రాంతి కుమార్, మునిసిపల్ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్ హాజరై టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే భిక్షపతి మాట్లాడుతూ, క్రీడలు శారీరక ఆరోగ్యానికి ఎంతగానో ఉపకరిస్తాయని, ఆటలు స్నేహభావంతో ఆడాలని, గెలుపు ఓటములను సహజంగా తీసుకోవాలని అన్నారు. ఉత్తమంగా ప్రదర్శన ఇస్తే జిల్లా స్థాయిలో, రాష్ట్రస్థాయిలో అవకాశాలు తప్పకుండా లభిస్తాయని తెలిపారు. ప్రతి క్రీడాకారుడు పట్టుదలతో కృషి చేస్తే దేశానికే మంచి పేరు తీసుకురాగలరని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ సభ్యులు ఎర్రబెల్లి భాస్కర్ రెడ్డి, పరకాల సమన్వయ కమిటీ నాయకులు దుబాసీ వెంకటస్వామి, కొలనుపాక సిద్ధు, కార్యక్రమ నిర్వాహకులు ఎల్తూరి చిన్ను, లడ్డు, మంద టునీట్, వినాయక హాస్పిటల్ యజమాన్యం, సతీష్ సెల్ పాయింట్ అఖిల్, ప్రణయ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ టోర్నమెంట్‌కు యువత నుంచి విశేష స్పందన లభించింది.

# ఇంటర్ ఫలితాల్లో శివాని విద్యార్థుల విజయ దుదుంభి




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నేడు విడుదల చేసిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో శివాని జూనియర్ కళాశాల విద్యార్థులు విజయ దుదుంభి మోగించారు. మొదటి సంవత్సరం ఎంపీసీ విభాగంలో 468/470 మార్కులతో ఎన్.రిషిత, ఎన్.నవదీప్, ఎల్.చక్రిక, బైపీసీ విభాగంలో బి.స్వాతి 435/440, ఎం. ఇంద్రజ 435/440, రెండవ సంవత్సరం ఎంపీసీ విభాగంలో 995/1000 మార్కులతో సి.సాయిజా, కె.మాధవి, బైపీసీ విభాగంలో ఎ.హాసిని 993/1000 ఫలితాలను సాధించారు. ఈ సందర్భంగా ఫలితాలను సాధించిన విద్యార్థులను కళాశాల కరెస్పాండంట్ టి.స్వామి, ప్రిన్సిపాల్స్ సురేందర్ రెడ్డి, చంద్రమోహన్, డైరెక్టర్లు రాజు, రమేష్, మురళీధర్, సురేష్ సంతోష్ అభినందించారు. ఈ విజయానికి సహకరించిన కళాశాల అధ్యాపకులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

# దామెరలో బ్యాంకు శాఖ ఏర్పాటుకు విజ్ఞప్తి

**వరంగల్ వాయిస్, దామెర :** దామెర మండల కేంద్రంలో తక్షణమే బ్యాంకు శాఖను ఏర్పాటు చేయాలని కోరుతూ, బీజేపీ దామెర మండల అధ్యక్షుడు వెల్పుల రాజ్ కుమార్ ఆధ్వర్యంలో ముల్క ప్రసాద్, బత్తుల సుమంత్ లు కలిసి హనుమకొండ జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్ ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, "గత తొమ్మిదేళ్లుగా దామెర మండల కేంద్రంగా కొనసాగుతున్నా ఇప్పటికీ బ్యాంకింగ్ సదుపాయాలు లేకపోవడం వల్ల ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్, నక్సలైట్ బెదిరింపుల కారణంగా వరంగల్ పట్టణానికి తరలించబడింది," అని తెలిపారు. బ్యాంకింగ్ సేవలు లేనిది గ్రామీణ అభివృద్ధిపై ప్రతికూల ప్రభావం చూపుతోందని, ప్రజల ఆర్థిక అవసరాలను దృష్టిలో పెట్టుకుని వెంటనే దామెరలో బ్యాంకు శాఖ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రస్తుతం దామెర మండలంలో తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయం, పోలీస్ స్టేషన్ వంటి ముఖ్యమైన ప్రభుత్వ శాఖలు ఉన్నప్పటికీ, బ్యాంకు శాఖ లేకపోవడం వల్ల లాదెళ్ల, కోగిల్వాయి,



సింగరాజుపల్లి, వెంకటాపూర్, ఒగులాపూర్ గ్రామాల ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. రైతులు, డ్వాక్రా మహిళలు, చిన్న వ్యాపారులు, పింఛన్ దారులు, ఉద్యోగులు ఇలా అన్ని వర్గాలకూ బ్యాంకు సేవల కొరత తలదన్నుతోందని నాయకులు వివరించారు. ఈ విషయంపై లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్ గారు స్పందిస్తూ, సంబంధిత బ్యాంకు అధికారులతో చర్చించి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# ధర్మసాగర్ ప్రభుత్వ కళాశాల ప్రభంజనం

## ఇంటర్ ఫలితాల్లో జిల్లాలో ప్రథమ స్థానం





**వరంగల్ వాయిస్, ధర్మసాగర్ :** ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాలలో ధర్మసాగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రతిభను చాటుకుంది. కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి, కళాశాల ఖ్యాతిని మరింత పెంచారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ అస్నాల శ్రీనివాస్ మాట్లాడుతూ, "సాధారణంగా పరిగణించబడే విద్యార్థుల నుంచి అసాధారణ ఫలితాలు రావడం గర్వకారణం" అని తెలిపారు. రెండవ సంవత్సరం విద్యార్థులు ఎంపీసీ రిషిక – 988, మనోజ్ఞ – 965, శ్రీధర్ – 965, ఉత్తేజ్ రెడ్డి – 965, నితిన్ – 962, బీపీసీ సాత్విక – 980 భువన కృతి – 976, సౌమ్య – 975, అంజన్ కుమార్ – 969, హెచ్ఈసీలో చందు – 903/1000, అభిలాష్ – 860/1000 మార్కులు సాధించారు. మొదటి సంవత్సరం విద్యార్థులు ఎంపీసీలో నవనీత్ గుప్తా – 466, హర్షిత్ సాయి – 464, హితేష్ – 459, హర్ష వర్ధన్ – 453, బీపీసీలో సుప్రియ – 396, అక్షర – 388 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో 75% ఉత్తీర్ణతతో మొదటి స్థానం దక్కిందని, నాణ్యమైన విద్యను క్రమశిక్షణతో ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఇటువంటి విద్యా ప్రమాణాలు కలిగిన కళాశాలలో చేర్పించాలని కోరారు.

# సత్తా చాటిన మోడల్ కాలేజ్ విద్యార్థులు

**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ఇంటర్ పరీక్షల ఫలితాల్లో మోడల్ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ఉత్తమ ఫలితాలతో రాష్ట్రంలోనే మెరుగైన స్థానంలో నిలిచారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులలో బి.సాయి సుష్మ 462/470 (ఎంపీసీ) , జె మధుమిత426 /470( బైపీసీ), ఏ. శ్రీలక్ష్మి 447/500( సీఈసీ), రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులలో కే .అనిల్ 839/1000,( ఎంపీసీ) కే మహేశ్వరి952/1000 ( బైపీసీ) , ఈ. సాయి దుర్గేష్ 934/1000 ( సీఈసీ) ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ జి.ఉపేందర్ రావు, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

# ఇంటర్ ఫలితాల్లో ఏవీవీ విద్యార్థి ప్రభంజనం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** స్థానిక ఏవీవీ జూనియర్ కళాశాల ప్రథమ సంవత్సరం ఎంపీసీ విద్యార్థి క్రాంతి ఇంటర్మీడియట్ ఫలితాల్లో మెరిసిపోయాడు. మొత్తం 470 మార్కుల్లో 462 మార్కులు సాధించి తన ప్రతిభను నిరూపించుకున్నాడు. ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి డా. చందా విజయ్ కుమార్, శాశ్వత సభ్యులు చందా శ్రీకాంత్, ప్రిన్సిపాల్ డా. భుజేందర్ రెడ్డి, అధ్యాపకులు సంజీవ్, డా. బరుపాటి గోపి, కొడిమ్యాల శ్రీనివాసరావు తదితరులు క్రాంతిని ఘనంగా అభినందించారు. క్రాంతి భవిష్యత్తులో ఇంకా ఉన్నతమైన విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ కళాశాల విజయకేతనం

**వరంగల్ వాయిస్, శాయంపేట :** తెలంగాణ ప్రభుత్వం మంగళవారం విడుదల చేసిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో శాయంపేట మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విశేషంగా రాణించింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కందగట్ల కోటేష్ మాట్లాడుతూ, కళాశాల విద్యార్థులు ఇంటర్ మొదటి, రెండవ సంవత్సరాల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించారని తెలిపారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీ విభాగంలో భానుశ్రీ 470 మార్కులలో 450 మార్కులతో కళాశాల టాపర్‌గా నిలిచింది. బూర వరుణ్ 444 మార్కులు సాధించి మరొక గౌరవనీయమైన స్థానం సంపాదించాడు. రెండవ సంవత్సరం బైపీసీ విభాగంలో ఇంజపూరి కావ్యశ్రీ 1000 మార్కులలో 623, కొమ్ముల కీర్తన 585 మార్కులు సాధించి మంచి ఫలితాలు నమోదు చేశారు. ఈ విజయాలు విద్యార్థుల కృషి, అధ్యాపకుల నిబద్ధత, కళాశాల ప్రగతికి నిలువెత్తు నిదర్శనమని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

# పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** మహబూబాబాద్ జిల్లాలో పోషణ పఖ్వాడా కార్యక్రమం ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని మహిళా సాధికారత కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని ఐసీడీఎస్ సీడీపీఓ శిరీష పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, చిన్నారుల ఆరోగ్యంపై ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని, రక్తహీనత, తక్కువ బరువు, పౌష్టికాహార లోపాలను గుర్తించి, అవి నివారించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పిల్లల్లో మానసిక, శారీరక ఎదుగుదల పర్యవేక్షించడంతో పాటు అవసరమైన పౌష్టికాహారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా గర్భిణీ స్త్రీలు, బాలింతలకి చిరుధాన్యాలపై అవగాహన కల్పించడంతో పాటు సామూహిక అన్నప్రసన, శ్రీమంతాల కార్యక్రమాలు నిర్వహించారు. పౌష్టికాహార పదార్థాల వినియోగం వల్ల కలిగే లాభాలను సీడీపీఓ శిరీష వివరించారు. ఈ కార్యక్రమం 15 రోజుల పాటు సాగిందని, ప్రజల్లో పోషకాహారంపై చైతన్యం పెంచేందుకు విస్తృతంగా ప్రచారం చేసినట్లు ఆమె తెలిపారు.

# గర్భిణులు, బాలింతలు పౌష్టిక ఆహారం తీసుకోవాలి



**వరంగల్ వాయిస్, రఘునాథ్‌పల్లి :** గర్భిణులు, బాలింతలు పౌష్టిక ఆహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని మెడికల్ ఆఫీసర్ డా. స్రవంతి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పౌష్టిక ఆహారం కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఆమె మాట్లాడుతూ, సరైన పోషకాహారం తీసుకోవడం వల్ల గర్భిణులు ఆరోగ్యంగా ఉండటమే కాకుండా, శిశువుల పెరుగదల కూడా సజావుగా జరుగుతుందన్నారు. అనంతరం అదే కేంద్రంలో సామాజిక అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో, అంగన్‌వాడీ టీచర్లు మర్కాల శ్రీలత, కవిత, ఆశావర్కర్లు అనిత, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

# ఓటమితో తప్పుడు నిర్ణయాలు తీసుకోవద్దు

## దామెర ఎస్సై కొంక అశోక్




**వరంగల్ వాయిస్, దామెర :** ఇంటర్మీడియట్ ఫలితాలు విడుదలైన నేపథ్యంలో కొందరు విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తుంటే, మరికొందరు ఫెయిలయ్యామన్న నిరాశతో తప్పుడు నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఫెయిలవడం జీవితాంతం ఓటమి కాదు. సప్లిమెంటరీ పరీక్షల రూపంలో మరో అవకాశం ఉంది. ఒక్క తప్పిన అడుగు వల్ల, జీవితాంతం మీ తల్లిదండ్రులు కన్నీళ్లు కార్చే పరిస్థితి ఏర్పడొచ్చు. ఈ సందర్భంగా దామెర ఎస్ఐ కొంక అశోక్ మాట్లాడుతూ, "తప్పు చేయడంలో తప్పే లేదు, దాన్ని సరిదిద్దుకుంటే విజయం సాధించవచ్చు. సప్లీలో పాసై మీ సామర్థ్యాన్ని నిరూపించుకోండన్నారు. అలాగే వేసవి సెలవుల నేపథ్యంలో యువత చెరువులు, బావుల దగ్గర ఈతలు కొట్టేందుకు వెళ్లి ప్రమాదాలకు గురవవద్దని హెచ్చరించారు. ప్రస్తుత ఎండల తీవ్రత దృష్టిలో ఉంచుకుని బయట తిరగకూడదన్నారు. వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుని, జీవితానికి ఉపయోగపడే శిక్షణా కోర్సులు చేసి ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు. "ప్రజల భద్రతే మా పోలీస్ బాధ్యత," అని ఎస్ఐ అశోక్ అన్నారు .

# విద్యా, ఉద్యోగాల్లో క్రీడాకారులకు ప్రాధాన్యం

- సాఫ్ట్ బాల్ క్రీడాకారులకు అండగా నిలుస్తాం
- రాష్ట్ర అసోసియేషన్ చైర్మన్ సాంబశివరావు



**వరంగల్ వాయిస్, ఐనవోలు :** తెలంగాణ ప్రభుత్వం క్రీడాకారులకు విద్యా, ఉద్యోగాల్లో ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర సాఫ్ట్ బాల్ అసోసియేషన్ చైర్మన్ డా. పి. సాంబశివరావు తెలిపారు. ఐనవోలు మండలంలోని వెంకటాపూర్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో మంగళవారం ప్రారంభమైన సాఫ్ట్ బాల్ సమ్మర్ క్యాంపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకుని విద్యార్థులు సాఫ్ట్ బాల్ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని, మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యం వహించేలా శిక్షణ తీసుకోవాలని సూచించారు. తెలంగాణ సాఫ్ట్ బాల్ సంఘం క్రీడాకారులకు అండగా ఉంటుందని తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా సాఫ్ట్ బాల్ అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ క్యాంపు ఫిజికల్ డైరెక్టర్ ఆరూరి సుమలత సారథ్యంలో, పాఠశాల ప్రధానోపాధ్యాయులు డా. తాళ్లపల్లి రమేష్, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు, క్రీడా ప్రోత్సాహకుల సహకారంతో నిర్వహించబడుతోంది. క్రీడా దాతలు జి. రేణుక శ్రీనివాస్, పిండి మాధవి మహేందర్, పిండి విఠల్, ఎం.చిరంజీవి తమ మద్దతును ప్రకటించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు, ప్రోత్సాహకులను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఈఓ ఆనందం, హనుమకొండ జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి తాబేటి రాజేందర్, ఉపాధ్యక్షులు పెరుమాండ్ల సాంబమూర్తి, కోచ్ వినయ్, హెచ్‌ఎంలు డి.సరస్వతి, జి. పద్మావతి తదితరులు పాల్గొన్నారు. ఉపాధ్యాయులు చంద్రకళ, సూరిబాబు, మన్మోహన్, పూర్ణచందర్, లక్ష్మీనారాయణ, రాజిరెడ్డి, అశోక్, సెలీనా, ఆదిలక్ష్మి, సంధ్యారాణి మరియు విద్యార్థులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# జమ్మికుంట పత్తి మార్కెట్ సందర్శన



**వరంగల్ వాయిస్, జమ్మికుంట :** ఢిల్లీ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన రీసెర్చ్ స్కాలర్లు హర్షిత, రంజిని మేడం తెలంగాణలోని వివిధ వ్యవసాయ మార్కెట్లను సందర్శిస్తున్నారు. ఈ సందర్శనలో భాగంగా వారు మంగళవారం జమ్మికుంట పత్తి మార్కెట్ యార్డును సందర్శించారు. అక్కడ రోజువారీగా జరిగే క్రయ విక్రయాల పరిస్థితిని పరిశీలించారు. పత్తి ఉత్పత్తి, మార్కెటింగ్ విధానాలు, జిన్నింగ్ మిల్స్ కార్యకలాపాలపై అవగాహన పొందారు. వారితో పాటు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న– సదానందం, వైస్ చైర్మన్ ఎర్రం సతీష్ రెడ్డి, పాలకవర్గ సభ్యులు, మార్కెట్ కార్యదర్శి ఆర్.మల్లేశం, ద్వితీయ శ్రేణి కార్యదర్శి ఎన్.రాజా, మార్కెట్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా గ్రాడ్యుయేషన్ డే




**వరంగల్ వాయిస్, నర్మెట్ట :** మండలంలోని హన్మంతాపూర్ ప్రాథమిక పాఠశాలలో ఐదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు, గ్రాడ్యుయేషన్ డే వేడుకల సమావేశం ప్రధానోపాధ్యాయుడు దూడల రమేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు సామల కమల పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ప్రాథమిక విద్యలో రాటుదేలితేనే ఉన్నత విద్యాభ్యాసం తేలికవుతుందని తెలిపారు. అనంతరం వారికి సర్టిఫికెట్స్, మెమోంటోస్ అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్ పర్సన్ వి.ఆశలత, ఉపాధ్యాయులు పి.విద్యావతి, గుర్రాల కర్ణాకర్, మినలాపురం పవన్, సీఆర్పీ రవీందర్ లాల్, అంగన్వాడి టీచర్స్ మమత, సంధ్య ఆయాలు అనిత, స్వప్న, ఐలమ్మ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# మడత శ్రీనివాస్‌కు ఘన సన్మానం



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండలంలోని బూర్గుమల్ల గ్రామ పాఠశాలలో మంగళవారం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మడత శ్రీనివాస్ గారికి పదవీ విరమణ సందర్భంగా ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయ వృత్తిలో విస్తృతమైన అనుభవంతో విద్యారంగానికి అనేక సేవలు అందించిన మడత శ్రీనివాస్కు పలువురు ప్రముఖులు, స్థానిక ప్రముఖులు హాజరై పూలమాలలు వేసి, శాలువాలతో ఘనంగా సన్మానించారు. జ్ఞాపికలు, బహుమతులు అందజేసి ఆయన భవిష్యత్తు జీవితం సుఖమయంగా కొనసాగాలని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీ పాల్ రెడ్డి మడత శ్రీనివాస్ సేవలను ప్రశంసించారు. ఈ సందర్భంగా సహచర ఉపాధ్యాయులు, స్నేహితులు, గ్రామస్థులు పాల్గొని కార్యక్రమాన్ని మరింత వైభవంగా మార్చారు. అనంతరం మడత శ్రీనివాస్ సభను ఉద్దేశించి మాట్లాడారు. తన ఉపాధ్యాయ జీవితంలోని అనుభవాలను, స్ఫూర్తిదాయక సంఘటనలను అందరితో పంచుకుంటూ, విద్యార్థులపై తనకున్న ప్రేమను తెలియజేశారు. ఈ కార్యక్రమం ఆహ్లాదకరంగా సాగి, విద్యారంగంలో మడత శ్రీనివాస్ పాత్రను మరోసారి గుర్తు చేస్తూ అందరి మనసులు గెలుచుకుంది.



# తండ్రి చావుకు బాధ్యులైన కుటుంబ సభ్యులపై చర్యలు తీసుకోవాలి

**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** ఆస్తి కోసం కన్న తండ్రిని మానసికంగా వేధించి ఆత్మహత్యకు ప్రేరేపించిన చిన్న కొడుకు, కోడలుపై కఠినంగా శిక్షించాలని వరంగల్, హనుమకొండ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ నేతలు డిమాండ్ చేశారు. వర్ధన్నపేట మండలం కడారిగూడెం గ్రామానికి చెందిన నాంపెల్లి మల్లేశం (93) తన చిన్న కొడుకు, కోడలిచే తీవ్ర మానసిక వేధింపులు, అసభ్య పదజాలంతో తిట్లాటలు భరించలేక, ఈ నెల 14న గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటనపై స్పందించిన సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ అధ్యక్షులు కోన్ రెడ్డి మల్లారెడ్డి, దామెర నర్సయ్య (రిటైర్డ్ డీఎస్పీ) మాట్లాడుతూ, "తల్లిదండ్రుల సంరక్షణ బాధ్యత మరిచి ఈ రీతిగా ప్రవర్తించడం సిగ్గుచేటన్నారు. ఇలాంటి అమానవీయ చర్యలు పునరావృతం కాకుండా ఉండాలంటే, బాధ్యులైన వారిపై కఠినమైన శిక్షించాలని డిమాండ్ చేశారు. పోలీసు శాఖ దీనిని అత్యంత ప్రాముఖ్యతతో తీసుకొని న్యాయంగా ముందుకు వెళ్లాలని కోరారు.



నాంపెల్లి మల్లేశం ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, ఈ ఘటన స్థలంలో మౌనం పాటిస్తూ శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో మృతుడి బంధువులు, స్నేహితులు, మాజీ సర్పంచ్ మంద సతీష్, వరంగల్–హనుమకొండ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ నాయకులు, వర్ధన్నపేట సీడీపీఓ దబేరా, ప్రధాన కార్యదర్శులు సదానందం, యుగేందర్, సభ్యులు ఉపేందర్ రెడ్డి ఇంజినీర్, రాజేంద్ర ప్రసాద్, చంద్రశేఖర్, యాదగిరి, లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

# రావుబహద్దూర్‌గా వస్తోన్న సత్యదేవ్

యంగ్ హీరో సత్యదేవ్ గురించి పరిచయం అక్కర్లేదు. క్యారెక్టర్ అర్టిస్ట్‌గా ఎంట్రీ ఇచ్చి ప్రజంట్ హీరోగా మంచి మంచి కథలు ఎంచుకుంటున్నారు సత్యదేవ్. 'బ్రోచేవారెవరురా', 'ఇస్మార్ట్ శంకర్' , 'సరిలేరు నీకెవ్వరు' వంటి బ్లాక్ బస్టర్ మూవీస్‌తో గుర్తింపు పొంది.. తర్వాత 'బ్లఫ్ మాస్టర్' మూవీ తో హీరోగా మారిన సత్యదేవ్ 'ఉమా మహేశ్వర ఉగ్ర రూపస్య', మూవీ లో అద్భుతంగా పెర్ఫార్మ్ చేసి ప్రేక్షకుల నుంచి ప్రశంసలు అందుకున్నారు. తర్వాత 'గుర్తుందా శీతాకాలం', 'తిమ్మరుసు', 'గాడ్సే' వంటి మూవీస్ లో నటించి మంచి గుర్తింపు సంపాదించుకున్నాడు. చివరగా 'జీబ్రా' మూవీతో అలరించిన సత్య ప్రజంట్ మరో ప్రాజెక్ట్ తో రాబోతున్నాడు. కేరాఫ్ కంచరపాలెం', 'ఉమామహేశ్వర ఉగ్రరూపశ్య' సినిమాతో ఆకట్టుకొన్న దర్శకుడు వెంకటేష్ మహాతో మూవీ చేస్తున్నాడు ఈ యంగ్ హీరో. అయితే తాజాగా మూవీ టీం ఈ ప్రాజెక్ట్‌కి 'రావు బహదూర్' అనే టైటిల్‌ని ఖరారు చేశారు. అయితే ఈ మూవీలో సత్యదేవ్ గెటప్, క్యారెక్టరైజేషన్ మునుపెన్నడు చూడని విధ్ధంగా విచిత్రంగా ఉంటుందని తెలుస్తోంది. దాదాపు రూ.25 కోట్లతో ఈ సినిమా రూపొందిస్తున్నారు. సత్యదేవ్‌పై ఇంత పెట్టుబడి పెట్టడం అంటే చిన్న విషయం కాదు. కథని నమ్మి నిర్మాతలు చేస్తున్న రిస్క్ అనుకోవాలి. సత్యదేవ్ టాలెంటెడ్ యాక్టర్ ఇందులో అనుమానం లేదు. తనకో కమర్షియల్ హిట్ అవసరం..
అందుకే నిర్మాత రిస్క్ చేస్తున్నట్లు–న్నారు.







# తుడరుమ్..
# తెలుగు ట్రైలర్ విడుదల

ఒకవైపు ఎల్2 ఎంపురాన్ సినిమాతో విజయం అందుకున్న మలయాళ స్టార్ మోహన్ లాల్ మరో సినిమాను విడుదలకు సిద్ధం చేశాడు. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'తుడరుమ్' ఈ సినిమాకు మలయాళ పాపులర్ డైరెక్టర్, ఆపరేషన్ జీవా ఫేం తరుణ్ మూర్తి దర్శకత్వం వహిస్తుండగా.. రెజపుత్ర విజువల్ మీడియా సమర్పణలో ఎమ్ రెంజిత్ నిర్మిస్తున్నారు. ఇక ఈ చిత్రంలో సీనియర్ నటి శోభన కథానాయికగా నటిస్తుంది. ఇప్పటివరకు మోహన్ లాల్, శోభన కాంబోలో 55 సినిమాలు రాగా.. ఇది 56వ చిత్రంగా రాబోతుంది. మోహన్‌లాల్‌తో చివరిగా 1987లో నటించిన శోభన దాదాపు 38 ఏండ్ల తర్వాత మళ్లీ కలిసి నటిస్తుంది. ఈ చిత్రం మలయాళంతో పాటు– తెలుగులో ఏప్రిల్ 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి తెలుగు ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రబృందం.ఈ సినిమా కథ విషయానికి వస్తే.. మోహన్ లాల్ ఇందులో టాక్సీ డ్రైవర్‌గా నటిస్తుండగా.. అతడి కారు అనుకోకుండా ఒక సమస్యలో ఇరుక్కుంటుంది. అయితే ఆ సమస్య ఏంటి.. ఆ కారుని వదిలిపెట్టి మోహన్‌లాల్ ఒక్కక్షణం ఎందుకు ఉండలేడు అనేది తెలియాలంటే ఈ సినిమా చూడాల్సిందే. క్రైమ్ కామెడీగా ఈ చిత్రం రాబోతుంది.





# సందర్భ శుద్ధి లేని కమల్ వ్యాఖ్యలు

ఎంత పెద్ద నటీనటులు అయినా సరే మాట్లాడే ముందు కాస్త ముందు వెనక చూసుకోవాలి లేదంటే అనూహ్యంగా వివాదాల బారిన పడటం తప్పదు. తాజాగా తమిళ స్టార్ హీరో కమల్ హాసన్ ఇలాగే త్రిషతో మాట్లాడి ఇప్పుడు ఇబ్బందుల పాలయ్యాడు. అసలు విషయం ఏమిటంటే మణిరత్నం డైరెక్ట్ చేసిన 'తగ్ లైఫ్' సినిమా రిలీజ్‌కి రెడీ అవుతోంది. ఈ సినిమాలో కమల్ హాసన్, త్రిషతో పాటు– శింబూ కీలక పాత్రలో నటించాడు. ఈ సినిమాకి సంబంధించిన ప్రమోషన్స్ ఊపందుకున్నాయి. సినిమా జూన్‌లోనే రిలీజ్‌కి రెడీ అవుతూ ఉండడంతో ఇప్పటికే ఒక సాంగ్ లాంచ్ చేశారు. తమిళంలో ప్రమోషనల్ ఇంటర్వ్యూలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఒకరు త్రిష ఫేవరెట్ ఫుడ్ గురించి అడిగారు. దానికి ఆమె బాయిల్డ్ బనానా అని చెబుతూ.. దానిని తమిళంలో ఏదో అంటారు, అది నోరు తిరగడం లేదంటూ చెప్పుకొచ్చింది. దానికి వెంటనే కమల్ హాసన్ కల్పించుకొని, పేరెంటో తెలియదు కానీ నోట్లో పెట్టుకోవడం మాత్రం ఇష్టం అంటూ కామెంట్ చేశాడు. అంతేకాకుండా వెంటనే చేత్తో ఆమె తొడ మీద చరిచాడు. ఆ వీడియో చూస్తే మాత్రం కమల్ హాసన్ డబుల్ మీనింగ్‌తోనే మాట్లాడాడేమో అనే ఫీలింగ్ కలుగుతుంది. ఆయనకు అలాంటి ఉద్దేశం లేకపోయినా, త్రిష వంక చూస్తూ ఆ మాటలు మాట్లాడడం, వెంటనే తొడ మీద చరచడం వంటివి దాన్ని తప్పు దోవ పట్టిస్తున్నాయని చెప్పాలి.



# ప్రభాస్‌కు తల్లి కావాలనుంది

## అలనాటినటి జరీనావాహబ్ కోరిక

బాహుబలి సినిమాతో పాన్ ఇండియా స్టార్‌గా మారిన ప్రభాస్ ఆ తర్వాత సలార్, కల్కి వంటి సూపర్ హిట్ చిత్రాలతో ఫుల్ క్రేజ్ సంపాదించుకున్నారు. ఇప్పుడు ది రాజా సాబ్ అనే చిత్రం చేస్తున్నారు. ఈ మూవీలో సీనియర్ నటి జరీనా వహాబ్ కీలక పాత్ర పోషిస్తుంది. అయితే ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న జరీనా.. ప్రభాస్ పనితీరు, ఆయన నడవడికపై ఆసక్తికర కామెంట్స్ చేసింది. ప్రభాస్ ఎంతో మంచి వ్యక్తి అని, సెట్ లో అందరితో చాలా ఫ్రెండ్లీగా ఉంటాడంటూ చెప్పుకొచ్చింది. అంతేకాక వచ్చే జన్మలో ప్రభాస్‌కి తల్లి కావాలనే కోరిక నాకు ఉందని తెలియజేసింది. జరీనా వహాబ్ కు ప్రస్తుతం సూరజ్ పంచోలి అనే కుమారుడు ఉన్నాడు. అతను కూడా బాలీవుడ్ నటుడు. అయితే తనకు మరో జన్మ ఉంటే మాత్రం ఆ జన్మలో సూరజ్ తో పాటు ప్రభాస్ కూడా కొడుకుగా కావాలని ఆమె కోరుకుంటుంది. ప్రభాస్ చాలా అందమైన వ్యక్తి మాత్రమే కాదు ఆయన మనసు వెన్న అంటూ కూడా జరీనా చెప్పడం విశేషం. ఆమె చేసిన కామెంట్స్ ఇప్పుడు వైరల్ గా మారాయి. ది రాజా సాబ్ చిత్రంలో ప్రభాస్ జరీనా తల్లి కొడుకులుగా కనిపిస్తారు. ఇక ఇదిలా ఉంటే సెట్‌లో ప్రభాస్ ఎలా ఉంటాడో తెలియజేస్తూ జరీనా ఆసక్తికర కామెంట్స్ చేసింది. ప్రభాస్ పార్ట్ షూటింగ్ కంప్లీట్ అయిన కూడా, షూటింగ్ చేసే సన్నివేశం లేనప్పుడు కూడా ప్రభాస్ సెట్‌లో ఉండటానికి ఎక్కువ ఇష్టపడతాడని జరీనా వహాబ్ తెలిపింది. విరామ సమయంలో కూడా ప్రభాస్ వానిటీ– వ్యాన్ వద్దకు వెళ్లరని, సెట్ లోనే చుట్టూ తిరుగుతూ తోటి నటు–లతో సరదాగా ఉంటారని చెప్పుకొచ్చింది జరీనా. ఇక సెట్‌లో అందరిని డార్లింగ్ అని పిలుస్తూ, ఎవరి–కై–న ఆకలిగా ఉంటే వెంటనే ఇంటి నుండి ఫుడ్ తెప్పించి స్వయంగా ఆయనే వడ్డిస్తారని కూడా తెలియజేసింది. ప్రభాస్ మంచి భోజన ప్రియుడు అని కూడా జరీనా పేర్కొంది. ఇక మారుతి దర్శకత్వం వహించిన 'ది రాజా సాబ్'లో ప్రభాస్ ద్విపాత్రాభినయంలో కనిపించనున్నారు.
ఈ చిత్రం మే నెలలో విడుదల కానుంది.

# యువకుడి కిడ్నాప్, హత్య

- కానిస్టేబుల్ తో సహ ఐదుగురి అరెస్ట్
- వివరాలు వెల్లడించిన సీపీ సన్‌ప్రీత్ సింగ్

**వరంగల్ వాయిస్, క్రైం :** తన బంధువుతో అక్రమ సంబంధం కొనసాగిస్తున్నాడని ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేసి కానిస్టేబుల్ సస్పెండ్‌కు కారణమైన యువకుడు చిడెం సాయి ప్రకాశ్ ను కిడ్నాప్ చేసి అత్యంత దారుణంగా హత్య చేయించిన కానిస్టేబుల్‌తో సహ ఐదుగురిని హనుమకొండ పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి నుంచి నిందితులు వినియోగించిన కారు, రెండు ఆటోలు, రెండు ద్విచక్ర వాహనాలు, ఒక ఎయిర్ పిస్తోల్‌లు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసుకు సంబంధించిన వివరాలను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ మంగళవారం వెల్లడించారు. హనుమకొండ జిల్లా చింతగట్టు ప్రాంతానికి చెందిన బాషబోయిన శ్రీనివాస్ ములుగు జిల్లాకు వాజేడ్ వెంకటాపురం పోలీస్ స్టేషన్ లో కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్నారు. ఇదే ప్రాంతంలో నివసిస్తున్న చింతం నిర్మలతో ఇతడికి పరిచయం ఏర్పడి అది కాస్త అక్రమ సంబంధానికి దారితీసింది. నిర్మలకు వరుసకు కొడుకైన చిడెం సాయి ప్రకాశ్ దీనిని గమనించి ఆమె భర్తతో కలిసి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. కానిస్టేబుల్ శ్రీనివాస్ వ్యవహారంపై విచారణ చేపట్టిన ఉన్నతాధికారులకు ఆయనను సస్పెండ్ చేసారు. అయితే గత ఏడాది డిసెంబర్ లోనే శ్రీనివాస్ తిరిది విధుల్లో చేరాడు. తనపై పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేసి సస్పెండ్ కు కారణమైన సాయి ప్రకాశ్‌పై కక్ష్య పెంచుకున్న



శ్రీనివాస్ తగిన సమయం కోసం ఎదురు చూసాడు. ఈ నెల 15న నిర్మల మామాగారికి ఆరోగ్య పరీక్షలకై కొసం తన భర్తతో పాటు, సాయి ప్రకాశ్‌తో కలిసి హనుమకొండకు కారులో వచ్చారు. అప్పటికే సమయం కోసం ఎదురు చూస్తున్న కానిస్టేబుల్ శ్రీనివాస్ కు నిర్మల తాము హనుమకొండ వచ్చినట్లు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చింది. అప్పటికే పలు మార్లు రెక్కి నిర్వహించిన సుపారి గ్యాంగ్ సభ్యులైన గుంటూరు జిల్లాకు చెందిన డేవిలీ సాయి, హనుమకొండకు చెందిన ఆలోత్ అరుణ్ కుమార్ అలియాస్ పండు, సబావత్ అఖిల్ నాయక్, రాజులతో కలిసి హనుమకొండకు చేరుకున్నారు. సాయి ప్రకాశ్ ఒంటరీగా ప్రయానిస్తున్న కారును ఆటోతో వెంబడించారు. గోపాల్‌పూర్ క్రాస్ రొడ్ లోని బేబి సైనిక్ స్కూల్ సమీపంలో రాత్రి సుమారు 11.30 గంటలకు కారును అడ్డగించి సాయి ప్రకాశ్ తీవ్రం కొట్టుకుంటూ ఆటోలో ఎక్కించారు. హసన్‌పర్తి శివారు ప్రాంతంలో సాయి ప్రకాశ్‌ను శాలువతో గొంతు బిగించి దారుణంగా హత్య చేసారు. హత్య అనంతరం సాయి ప్రకాశ్ కారులోనే హుస్నాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జిల్లెడు గడ్డ తండా గ్రామ శివారుకు చేరుకొని ఓ బావిలో మృతదేహాన్ని పడవేసి నిందితులు వేలేరు మీదుగా హనుమకొండ ఏషియన్ మాల్ ప్రాంతంలో కార్‌ను పార్క్ చేసినట్లు నిందితులు పోలీసుల విచారణలో వెల్లడించారని సీపీ తెలిపారు. మరుసటి రోజున మృతుడి మృతదేహాన్ని గుర్తించి జిల్లెడు గడ్డ తండా గ్రామస్తులు ఇచ్చిన సమాచారంతో అనుమాన్పదంగా మరణించిన వ్యక్తిగా హుస్నాబాద్ పోలీసులు కేసును నమోదు చేసి దర్యాప్తు చేయగా అసలు విషయాలు బయటొచ్చాయి. నింధితులు హత్య చేసినట్లు ఒప్పున్నట్లు సీపీ వెల్లడించారు.

# కన్న కొడుకుని కడతేర్చిన తండ్రి

- రోకలి బండతో బాది హత్య
- రేగొండ మండలం రేపాకపల్లి గ్రామంలో దారుణం

**వరంగల్ వాయిస్, రేగొండ :** కన్న కొడుకును రోకలి బండతో కొట్టి దారుణంగా హత్య చేశాడు ఓ కసాయి తండ్రి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఉమ్మడి రేగొండ మండలం రేపాక పల్లి గ్రామానికి చెందిన కసం ఓదెలు (35) 108 అంబులెన్స్ డ్రైవర్ గా పని చేస్తున్నాడు. పరకాల మండలానికి చెందిన కాసం దేవితో గత 14 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. ఓదెలు తండ్రి కసం మొండయ్య కోడలితో పెళ్లి అయినప్పటినుంచి అసభ్యంగా ప్రవర్తిస్తూ ఉండేవాడు. ఈ విషయంలో గతంలో పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టించినప్పటికీ అతని ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాలేదు. ఇదే విషయంపై తండ్రి కొడుకులకు తరుచు గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో సోమవారం ఓదెలు తన పెళ్లి రోజు సందర్భంగా రాత్రి 7 గంటల సమయంలో వేడుకలు చేసుకుంటూ ఉండగా మాటా మాటా పెరిగి తండ్రి కొడుకుల మధ్య గొడవ జరిగింది. ఇంటి పక్కనున్న కురుమ లక్ష్మీనారాయణ తన ఇంటికి తీసుకెళ్లి తండ్రి కొడుకులకు సర్ది చెప్పి గొడవను తగ్గించాడు. ఈ విషయాలను మనసులో పెట్టుకొని మొండయ్య ఎలాగైనా తన కొడుకును అడ్డు తొలగించి కోడలిని దక్కించుకోవాలన్న దురుద్దేశంతో ఉన్నాడు. మంగళవారం ఉదయం 7 గంటల సమయంలో ఓదెలు తన ఇంటి ముందు వరండాలో పడుకుని ఉండగా ఇదే సరైన సమయం అని భావించిన తండ్రి మొండయ్య దగ్గరలో ఉన్న రోకలిబండతో తలపై కొట్టగా తీవ్ర రక్తస్రావాలు జరిగి అక్కడికక్కడే మృతి చెందాడు. నిందితుడు అక్కడ నుంచి పారిపోగా, సంఘటన స్థలాన్ని డీఎస్ పి సంపత్ రావు, చిట్యాల సీఐ మల్లేష్ యాదవ్ తో కలిసి పరిశీలించారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సందీప్ కుమార్ తెలిపారు.

# భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

- రైతులందరికీ అవగాహన కల్పించాలి
- నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి

**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట/ఖానాపూర్ :** భూ భారతి చట్టంతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని నర్సంపేట శాసనసభ్యులు ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి అన్నారు. మంగళవారం వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గం చెన్నారావుపేట, ఖానాపూర్ మండలాల రైతు వేదికల వద్ద నిర్వహించిన భూ భారతి చట్టం -2025 అవగాహన సదస్సులకు ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. భూభారతి చట్టం గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా రెవెన్యూ అధికారులు రైతులకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి మాట్లాడుతూ ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న ప్రజల భూ సమస్యలను తొలగించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూభారతి నూతన ఆర్ఓఆర్ చట్టాన్ని ప్రతిష్టాత్మకంగా



అమలు చేస్తోందని ఆన్నారు. ఈ చట్టం ద్వారా భూ సమస్యలు పరిష్కారమవ్వడమే కాకుండా భవిష్యత్తులో భూ సమస్యలు, భూ వివాదాలు తలెత్తకుండా ఉంటాయన్నారు. ధరణి పేరుతో గతంలో గ్రామాల్లో విచ్చలవిడి చేశారని అన్నారు. వందల ఎకరాలు నిషేధిత జాబితాలో పెట్టి పేద ప్రజలను ఇబ్బందులకు గురిచేశారని, చిన్న చిన్న పేరు మార్పులకు కూడా తహసీల్దార్, ఆర్డీవో లకు అధికారం లేకుండా చేసి జిల్లా కలెక్టర్ వద్ద అధికారాలను కేంద్రీకృతం చేసి సమస్యలను మరింత క్లిష్టతరం చేశారన్నారు. భూ భారతి చట్టం ద్వారా అధికారాలను తహసీల్దార్, ఆర్డీవో లకు అధికారాలను అప్పగించారని. పెండింగ్ లో ఉన్న సాధాబైనామా లను క్లియర్ చేయాలని భూ భారతి చట్టంలో పేర్కొన్నామన్నారు. భూ భారతి చట్టం ద్వారా వారసత్వ హక్కుల్ని దరఖాస్తులను నెల రోజులలో పూర్తి చేయాలని చట్టంలో చేర్చామని, ధరణి పేరుతో గ్రామాల్లో భూ రికార్డులు లేకుండా చేశారన్నారు. భూ భారతి చట్టం ద్వారా భూముల రికార్డులను నిర్వహించడం ద్వారా ఎవరైనా ప్రభుత్వ భూములకు అక్రమంగా పట్టాలు పొందితే వాటిని రద్దు చేసే అధికారం భూ భారతి చట్టంలో పొందుపరిచామని అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి , ఆర్డీవో ఉమారాణి , మండల ప్రత్యేక అధికారులు బాలకృష్ణ, సౌజన్య, తహసిల్దార్లు ఫణి కుమార్, కిరణ్ , ఎంపీడీవోలు మండల అగ్రికల్చర్ అధికారులు తో పాటు నర్సంపేట మార్కెట్ ఛైర్మెన్ పాలాయి శ్రీనివాస్ తదితర నాయకులు పాల్గొన్నారు.



# రైతు సంక్షేమమే లక్ష్యం

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- ధర్మసాగర్ లో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**వరంగల్ వాయిస్, స్టేషన్ ఘనపూర్ :** రైతు సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. ధర్మసాగర్ మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం కడియం శ్రీహరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రెండు అతి ముఖ్యమైన పథకాల ద్వారా రైతులకు, పేద ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని వివరించారు. అవి సన్నాలు పండిస్తున్న రైతులను ప్రోత్సహించడానికి మద్దతు ధరతో పాటు క్వింటాకు రూ.500 బోనస్, రేషన్ కార్డు లబ్ధిదారులకు ఉచిత సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాలు అని అన్నారు. 25లక్షల మంది రైతులకు ఒక ఏడాదిలోనే రూ.21వేల కోట్ల రుణ మాఫీ చేయడంతో పాటు ఉచిత కరెంట్, రైతు భరోసా, రూ.500 బోనస్ అందిస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వం అన్నారు. దేశంలో ఏ రాష్ట్రం చేయని విధంగా తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమని వెల్లడించారు. వాతావరణ పరిస్థితులు ఎప్పుడు ఎలా ఉంటుందో తెలియడం లేదన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్లను అందుబాటులో ఉంచుకోవాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. తేమ 17శాతం ఉండాలని, బస్తా 41కేజీలు మాత్రమే తూకం వేయాలని ఈ విషయంలో రైతులను ఇబ్బంది పెట్టవద్దని స్పష్టం చేశారు. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలోనే ధాన్యం విక్రయించాలని, దళారుల వద్దకు వెళ్లి నష్టపోవద్దని సూచించారు. ఇంత గొప్పగా ప్రజా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై మీ అందరి ఆశీస్సులు, దీవెనలు ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్, ఎంపీడీఓ, వ్యవసాయ శాఖ అధికారులు, మహిళా సంఘాలు, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రసన్నాంజనేయ స్వామికి చందన సేవ

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ పద్మాక్ష రోడ్డులోని హనుమద్గిరి ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో మంగళవారం ఉదయం వేద పండితులు బ్రహ్మశ్రీ ఆరుట్లరామాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృత అభిషేకం, చందన సేవ, తమలపాకుల సేవలు నిర్వహించారు. బంతిపూలు దండలతో స్వామి వారిని అలంకరించారు. అనంతరం గోత్రనామార్చన నిర్వహించారు. మధ్యాహ్నం హనుమాన్ భజన మండలి వారిచే భజన కార్యక్రమం నిర్వహించి స్వాములకు, భక్తులకు అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో



అన్నదాన కమిటీ అధ్యక్షులు గందె కృష్ణ, కార్యదర్శి కనుకుంట్ల రవి కుమార్, గండ్రటి సుధాకర్, సీతా సమ్మయ్య, మాదాసు మొగులయ్య, తదితరులు పాల్గొన్నారు

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com